సాక్షి జగిత్యాల

మంగళవారం । 14 । నవంబర్ । 2023



పోలింగ్ శాతం పెంచేందుకు..
ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత. ఓటు పెంపుదల కోసం ఈసారి ఎన్నికల కమిషన్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది.
10లో▸



భయం భయంగా ప్రయాణం
జిల్లాలోని చాలావరకు ఉన్న ప్రధాన రహదారిపై ప్రయాణికులకు భద్రత కరువైంది.
11లో▸

గరిష్టం/కనిష్టం
31.0/21.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం మేఘావృతమై కనిపిస్తుంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

కొండగట్టులో దీపావళి వేడుకలు



కొండగట్టులో దీపాలంకరణ

కొండగట్టు (చొప్పదండి): కొండగట్టు అంజన్న స్వామి ఆలయంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో అర్చకులు దీపాలంకరణ చేశారు. చైర్మన్ మారుతిస్వామి, అర్చకులు కపీందర్, అనిల్, ఏఎస్ఐ శ్రీనివాస్, అధికారులు లక్ష్మీరాజం పాల్గొన్నారు.

నూతన నియామకం



రవీందర్

సారంగాపూర్: ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (540) రాష్ట్ర కో–ఆరినేటర్‌గా రాపాక రవీందర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ తెలిపారు. రవీందర్ ప్రస్తుతం బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి కృషిచేస్తానని వెల్లడించారు.

ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు



నర్సింగాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం గంగాధర్

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని ఏపీఎం గంగాధర్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్, అంతర్గాం, వెల్దుర్తి, అర్బన్ మండలం ధరూర్‌లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తేమ శాతం చూసి యుద్ధప్రతిపాదికన కొనుగోలు చేయడంతోపాటు, కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. ధాన్యాన్ని కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. సీసీలు విద్యాసాగర్, గంగారాం పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలకు అనుమతి ఎలా ఇస్తారు..?



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో మట్టి తవ్వకాలకు అనుమతులు ఎలా ఇస్తారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్ శివారు సర్వేనంబరు 437లో తవ్వకాలకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మైనింగ్ అధికారులు అనుమతులు జారీ చేశారని పేర్కొన్నారు. మున్సిపాలిటీకి మట్టి అవసరమైతే అధికారులే అంచనా రూపొందించి మైనింగ్‌శాఖకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంద ని, కానీ అంచనాలు లేకుండా.. బడ్జెట్ ఆమోదించకుండా.. మున్సిపాలిటీకి సంబంధం లేకుండా చాంద్‌పాషా అనే వ్యక్తి దరఖాస్తు చేసుకుంటే అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మొక్కలు నాటుతుండగా పరిరక్షించాల్సిన అధికారులు మాత్రం పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. గతంలో నర్సింగాపూర్ గ్రామస్తులు రాజకీయాలకు అతీతంగా సర్వేనంబరు 437 లో మట్టి తవ్వకూడదని నిర్ణయించుకుని కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. చాంద్‌పాషా క్వారీ కోసం అక్టోబర్ 21న దరఖాస్తు చేసుకుంటే నవంబర్ 7న అనుమతి ఇచ్చారని తెలిపారు. మైనింగ్ అధికారులతోపాటు, పంచాయతీ కార్యదర్శులను తక్షణమే విధుల నుంచి తొలగించి విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలన్నారు.

రూ.1.14లక్షలు పట్టివేత

మల్లాపూర్: సిరిపూర్ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద సోమవారం చేపట్టిన పోలీసుల వాహనాల తనిఖీల్లో బైక్‌పై తరలిస్తున్న రూ.1.14 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా తనిఖీలు చేస్తుండగా.. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న ఓ వ్యక్తి నుంచి రూ.1.14 లక్షలను స్వాధీనం చేసుకొని గ్రీవెన్స్‌సెల్‌కి అప్పగించినట్లు వివరించారు.

65 నామినేషన్ల తిరస్కరణ

జంగ్ తెలంగాణ

- 261 మంది అభ్యర్థులవి ఓకే..
- ప్రముఖ నేతల కుటుంబసభ్యులవీ రిజెక్ట్
- స్వతంత్రులుగా గంగుల రజిత, ఆది వనజ
- 15 వరకు ఉపసంహరణకు అవకాశం
- బరిలో ఉండే అభ్యర్థులెవరో తేలేది అప్పుడే..



ధర్మపురి: నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర

సాక్షిప్రతినిధి,కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల పరిశీలన సోమవారం ముగిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో మొత్తం 65 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. బీఫాంలు సమర్పించలేదని కొందరివి, తక్కువ మంది ప్రతిపాదించారని మరికొందరివి, సంతకాలు చేయకపోవడంతో ఇంకొందరివి రిజెక్ట్ చేసినట్లు నియోజకవర్గాల ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం 261 మంది వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల, స్వతంతుల నామినేషన్లు ఆమోదం పొందాయి. కాగా, ఈ నెల 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది.

ప్రధాన పార్టీల అభ్యర్థులు సేఫ్..

ఉమ్మడి జిల్లాలో అధికార బీఆర్‌ఎస్‌తోపాటు ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీలు ఈ ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి. ఇవి కాకుండా బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ, పలు చిన్న పార్టీల నాయకులు, ఇండిపెండెంట్లు బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీల నుంచి ఈసారి బరిలో ఉన్నవారిలో మంత్రులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఉన్నారు. ప్రస్తుతానికి వీరిలో ఎవరి నామినేషన్ కూడా తిరస్కరణకు గురికాలేదు. కానీ, ముందు జాగ్రత్తగా వారికి డమ్మీగా వేసిన బంధువులు, కుటుంబసభ్యులవి రిజెక్ట్ అయ్యాయి.

తిరస్కరణకు గురైంది వీరే..

హుజూరాబాద్ నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్ సతీమణి జమున బీజేపీ నుంచి, కోరుట్ల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తన కుమారుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్‌కి మద్దతుగా, మానకొండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి అనురాధ, మంథని నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు సతీమణి శైలజ, మంథని నుంచే బీఎస్పీ అభ్యర్థి చల్లా నారాయణరెడ్డి సతీమణి సుజాత నామినేషన్ వేశారు. బీఫాం ఇవ్వలేదన్న కారణంతో వీరందరి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా ఆయన సతీమణి వనజ నామినేషన్ వేశారు. ఈమె కాంగ్రెస్ తరఫున బీఫాం ఇవ్వకపోవడంతో రిజెక్ట్ చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా వేసిన నామినేషన్‌ను ఓకే చేశారు. కరీంనగర్ నుంచి మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత వేసిన నామినేషన్‌ను అధికారులు ఆమోదించారు. ప్రస్తుతానికి ఆమె స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. వీరిద్దరూ మంగళ, బుధ వారాల్లో నామినేషన్ ఉపసంహరించుకోనున్నారు.

ఉత్కంఠ రేపిన ఫిర్యాదులు

- పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి సీహెచ్.విజయరమణారావు విదేశీ ఆస్తులు, ఇక్కడ ఐటీ రిటర్నుల్లో వ్యత్యాసాలు ఉన్నాయంటూ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు వచ్చింది. అయితే, సంతృప్తికర వివరణతో ఈ ఫిర్యాదును ఆర్వో డిస్పోజ్ చేశారు.
- మానకొండూరులో కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ వర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నా వాటిని అధికారులు పరిగణలోకి తీసుకోలేదు.
- కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ కేసుల విషయమై ఆర్వోకు ఫిర్యాదు వచ్చింది. చివరకు ఆయన నామినేషన్‌ను అధికారులు ఓకే చేశారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు..

తిరస్కరించిన నామినేషన్లు : కరీంనగర్‌లో 7, చొప్పదండిలో 1, మానకొండూర్‌లో 7, పెద్దపల్లిలో 5, మంథనిలో 4, రామగుండంలో 5, జగిత్యాలలో 2, కోరుట్లలో 5, ధర్మపురిలో 19, హుజూరాబాద్‌లో 8, సిరిసిల్ల 0, వేములవాడలో 2.

ఆమోదం పొందినవి : కరీంనగర్‌లో 31, చొప్పదండిలో 17, మానకొండూర్‌లో 13, పెద్దపల్లిలో 25, మంథనిలో 24, రామగుండంలో 26, జగిత్యాలలో 19, కోరుట్లలో 20, ధర్మపురిలో 18, హుజూరాబాద్‌లో 25, సిరిసిల్లలో 23, వేములవాడలో 20.

ఈవీఎం.. వీవీప్యాట్ ఎప్పుడు వచ్చాయంటే..?



మీకు తెలుసా..!

పెద్దపల్లిరూరల్: మనదేశంలో ఎన్నికలను బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించేవారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో బ్యాలెట్ పేపర్ స్థానంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్‌యంత్రాలను (ఈవీఎం) అందుబాటులోకి తెచ్చారు. దేశంలోనే తొలిసారిగా 1982 మే19న కేరళ రాష్ట్రంలోని పరూర్ నియోజకవర్గంలో వినియోగించారు. తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని షాద్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలతోపాటు 1982, 83లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఈవీఎంలను వాడారు. అయితే వాటి పనితీరుపై రాజకీయ పార్టీలు అభ్యంతరం తెలుపగా కొంతకాలం నిలిపివేశారు. ఆ తర్వాత 1999, 2004లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నుంచి ఈవీఎంలను వినియోగిస్తున్నారు. అయితే తాము ఎవరికి ఓటు వేశామో ఓటరు తెలుసుకునేందుకు వీలుగా 2013 ఆగస్టు 14న ఈవీఎంలకు వీవీప్యాట్‌ను (ఓటర్ వెరిఫియేబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) అనుసంధానించారు. దీంతో ఓటర్లు తాము ఓటు వేయాలనుకునే వారికే వేశామా లేదా అని నిర్ధారించుకునేందుకు వీలుకలిగింది.

ఖర్చుల వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

- షాడో రిజిస్టర్ నిర్వహించాలి
- అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల ఖర్చుల వివరాలను నమోదు చేస్తూ షాడో రిజిస్టర్ నిర్వహించాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏఈఆర్వో, ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనుమతి లేకుండా వాహనాలను ప్రచారం కోసం వినియోగిస్తున్నారని, అలాంటి వాటిపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రచారంలో వినియోగిస్తున్న వీడియో, ఆడియో క్లిప్‌లను పరిశీలించాలన్నారు. మీసేవలో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలన్నారు. మద్యం, డబ్బు, అక్రమంగా రవాణా జరగకుండా చూడాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడిని కలిసిన ఎస్పీ



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

జగిత్యాలక్రైం/మల్యాల: కరీంనగర్ జిల్లా పోలీస్ అబ్జర్వర్, అడిషనల్ డీజీపీ సతీశ్ గణేశ్ సోమవారం మల్యాల, కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో ఉన్న పోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు. వారిని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసిన బందోబస్తు, బార్డర్ చెక్ పోస్టుల్లో వాహనాల తనిఖీలు, అక్రమంగా రవాణా చేస్తున్న నగదు, విలువైన వస్తువులు, మద్యం తదితర వాటి స్వాధీనం, సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలు, ఎన్నికల సమయంలో గొడవలను సృష్టించిన వారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తారనే అనుమానం ఉన్న వ్యక్తులను బైండోవర్ చేశామని పేర్కొన్నారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటస్వామి, మల్యాల సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్సైలు అశోక్, వెంకట్రావు పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు

- జిల్లా సరిహద్దుల్లో ఏడు చెక్‌పోస్టులు
- ఇప్పటివరకు రూ.2.17 కోట్ల పట్టివేత



చల్‌గల్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా ఎన్నికల అధికారుల బృందాలు, పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఎలాంటి అనుమతి లేని సామగ్రితోపాటు లెక్కలు లేని డబ్బులు, ఇతర రవాణాపై నిఘా పటిష్టం చేసి నగదు, వస్తువులు, మద్యం సీజ్ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.2,17,10,581 నగదు సీజ్ చేశారు. అలాగే రూ.22,18,055 విలువైన 4,731 లీటర్ల లిక్కర్ సీజ్ చేశారు. 3.6 కిలోల గంజాయి, రూ.1,34,87,597 విలువైన ఇతర వస్తువులను సీజ్ చేశారు. జిల్లావ్యాప్తంగా అభ్యర్థుల సమావేశాలతోపాటు వాల్‌రైటింగ్, కార్యకర్తల సమావేశాలపై ఈ బృందం నిఘా పెంచడంతో పాటు వీరి కదలికలపై వీడియో రికార్డింగ్‌లతో డేగ కన్ను వేస్తున్నారు.

జిల్లా సరిహద్దుల్లో నిఘా పటిష్టం

జిల్లాలో పోలీసుశాఖ నిఘా పటిష్టం చేసింది. జిల్లా సరిహద్దుల్లో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మెట్‌పల్లి సమీపంలోని గండి హనుమాన్ టెంపుల్ వద్ద, మల్లాపూర్ మండలం బాదన్‌కుర్తి వంతెన వద్ద, రాయికల్ మండలం బోర్నపల్లి వంతెన వద్ద, బీర్‌పూర్ మండలం కమ్మునూర్ బ్రిడ్జి వద్ద, ధర్మపురి మండలం రాయపట్నం వద్ద, కొండగట్టు వద్ద, కథలాపూర్ మండలం కల్వకోట వద్ద పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో మరో 9 రహదారుల వెంట చెక్‌పోస్టులు ప్రారంభించారు. వీటితో పాటు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు.

రాత్రివేళల్లో పోలీసు గస్తీ

ఎన్నికల నియమావళి అమలు కావడంతోపాటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసు శాఖ విస్తృత తనిఖీలతోపాటు అదనపు బృందాలతో తనిఖీలు చేపడుతున్నారు. రాత్రివేళల్లో జిల్లావ్యాప్తంగా నాలుగు 100 డయల్ పెట్రోలింగ్ వాహనాలతోపాటు, షీటీం బృందాలు కూడా గస్తీని ముమ్మరం చేశాయి. అనుమానితులు తిరిగినా, అనుమానిత వాహనాలు వెళ్లినా వాటిని అణువణువునా తనిఖీలు చేస్తున్నారు.

నిఘా పెంచాం

జిల్లావ్యాప్తంగా నిఘా మరింత పటిష్టం చేశాం. సరిహద్దుల్లో విస్తృతంగా వాహనాల తనిఖీ చేపడుతున్నాం. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో కూడా పోలీస్ శాఖ వాహనాల తనిఖీ చేపడుతోంది. ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదు, లిక్కర్, గంజాయి, ఇతర వస్తువులను సీజ్ చేస్తున్నాం.

– సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ





అలయంలోని అద్దాల మండపంలో దీపావళి పూజలు చేస్తున్న అర్చకులు

ముగిసిన లక్ష్మీపూజలు

ధర్మపురి: దీపావళి సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని అద్దాల మండపంలో లక్ష్మీదేవి పూజలు ఆదివారంతో ముగిశాయి. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ చేశారు. కార్యక్రమంలో రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 14 నుంచి 27 వరకు గంగహారతి చేపట్టనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు ఆలయం నుంచి గోదావరికి మేళతాళాలతో తరలివెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



నృసింహుడి సన్నిధిలో దీపాలంకరణ



నెమలిపించాలతో గోండులు



మంగేళలో నృత్యాలు చేస్తున్న గోండులు



గోండులతో ఎమ్మెల్యే సంజయ్

గోండు గూడాల్లో దండారీ వేడుకలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం గిరిజన గోండుగూడాల్లో దండారీ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాల మధ్య ఆనందాలు పంచుకున్నారు. నిర్మల్ జిల్లా కడెం మండలం మురిమడుగు గ్రామం నుంచి గోండులు బీర్‌పూర్ మండలం మంగేళ గోండుగూడెంకు చేరుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, అందరూ చల్లగా ఉండాలని పూజలు నిర్వహించారు. చిత్రవేణిగూడెం, చిన్న కొల్వాయిల్లోనూ వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిక్రం మారుతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాట స్థావరంపై దాడి

మెట్‌పల్లి: రెడ్డి కాలనీలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతో దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. వారి నుంచి రూ.6.50లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం


ముస్తాక్(ఫైల్)

కోరుట్లరూరల్: చిన్నమెట్‌పల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో మహమ్మద్ ముస్తాక్ (30) అనే వ్యక్తి మృతిచెందాడు. సోమవారం తను కౌలుకు చేసే పొలంలో కింద పడి ఉన్న విద్యుత్ తీగను చుడుతుండగా.. షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చంద్రన్నను ప్రజలు నమ్మొద్దు

మంథని/ముత్తారం: ముత్తారం మండలం మచ్చుపేటకు చెందిన బందారపు మల్లయ్య అలియాస్ చంద్రన్న సీపీఐ మావోయిస్టు పార్టీ నుంచి డబ్బులు ఎత్తుకొచ్చాడని, అతడిని విప్లవ ప్రజలు, అమరవీరుల కుటుంబాలు నమ్మొద్దని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 1986–87లో గత పీపుల్స్‌వార్ పార్టీలో రిక్రూమెంట్ అయిన చంద్రన్న మంథని ఏరియాలో దళ సభ్యుడి నుంచి కమాండర్, జిల్లా కమిటీ మెంబరుగా పని చేశాడని, మంథని ఏరియాలో పని చేసే క్రమంలో జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించాడన్నారు. మచ్చుపేట గ్రామంలో కామ్రేడ్స్ గట్టన్న, అమృతక్కతో పాటు దాదాపు ఎనిమిది మంది కామ్రేడ్స్ వారి ఆశయ సాధనలో అమరులయ్యారని, ఉద్యమ అవసరాలరీత్యా 2003లో దండకారణ్యానికి బదిలీ అయిన చంద్రన్న.. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో జిల్లా కమిటీ మెంబర్, కార్యదర్శిగా నిబద్ధతతో పని చేశాడని వివరించారు. ఉద్యమంలో ఎగుడుదిగుడులు, మారుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోలేకపోయాడని, నిర్బంధం పెరిగి దాడులు జరగడంతో ప్రాణ భయంతో ప్రజలకు ద్రోహం చేసి డబ్బులు ఎత్తుకొని పారిపోయాడని పేర్కొన్నారు. కాగా ఎన్నికల నేపథ్యంలోనే చంద్రన్నపై మావోయిస్టు ప్రకటన విడుదలయినట్లు తెలుస్తోంది.

బొగ్గు తరలిస్తున్న లారీ పట్టివేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారులో బొగ్గును అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకొని సింగరేణి కాంట్రాక్టర్ నరసింగరావు, డ్రైవర్ కార్తీక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. గోదావరిఖని 11బొగ్గు గని నుంచి రాఘవాపూర్ రైల్వే స్టేషన్‌కు బొగ్గును తరలించాల్సిన కాంట్రాక్టర్ నర్సింగరావు అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా.. రంగంపల్లి వద్ద సింగరేణి సెక్యూరిటీ జూనియర్ ఇన్స్‌పెక్టర్ ఉమేశ్, ఇతర సిబ్బంది పట్టుకున్నారన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

జమ్మికుంట(హుజూరాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ వివరాల ప్రకారం.. సైదాబాద్‌కు చెందిన కోడెం శ్రీనివాస్‌కు గోదావరిఖనికి చెందిన సువర్ణ(35)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. దంపతులిద్దరూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపనీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో దీపావళి నోము ఉందని శనివారం రాత్రి దంపతులు హైదరాబాద్ నుంచి బైక్‌పై సైదాబాద్ వస్తున్నారు. జమ్మికుంట పట్టణ శివారులోని స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పడంతో సువర్ణ కిందపడింది. ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాస్ అజాగ్రత్తగా బైక్ నడపడం వల్లే సువర్ణ మృతి చెందిందని ఆమె సోదరుడు పోరండ్ల భీంరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం


లక్ష్మీపూర్‌లో కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


జగిత్యాల: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ రమణ, సంజయ్‌కుమార్

- అభివృద్ధి, సంక్షేమమే బీఆర్‌ఎస్ ఎజెండా
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం అని, అభివృద్ధి, సంక్షేమమే నా ఎజెండా అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ రమణతో కలిసి నియోజకవర్గంలో ప్రచారం చేపట్టారు. జగిత్యాల పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేసుకోవడం జరిగిందని, పట్టణ ప్రజల కోసం ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఒకేచోట సమీకృత మార్కెట్ సైతం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు. కాంగ్రెస్ వస్తే కరెంటే ఉండదని, భూములు ఎడారులవుతాయన్నారు. ఓట్ల కోసమే జీవన్‌రెడ్డి తాపత్రయమని, ఓట్లు అడిగే హక్కు ఒక సంజయ్‌కుమార్‌కే ఉందని అన్నారు. 6వ వార్డులోని గోవిందుపల్లిలోని ఏసురక్తం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారి వెంట నాయకులున్నారు.

కష్టపడండి..

18 రోజులు కష్టపడండి.. 1800 రోజులు కష్టపడి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పలు వార్డుల్లోని వివిధ పార్టీలకు చెందిన యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కౌన్సిలర్ ప్రేమలత, సత్తన్న, ప్రతాప్‌రాజ్ పాల్గొన్నారు.

సాగునీరిచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌దే

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్రంలో నిరంతరం సాగునీరిచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని, పని చేసే ప్రభుత్వానికే పట్టం కట్టాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్, రఘురాములకోట, లక్ష్మీపూర్, గుత్రాజ్‌పల్లి, గుల్లపేట, అనంతారం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని, భూములు ఎడారులవుతాయన్నారు. నిరంతరం కరెంట్.. పుష్కలంగా పంటలతో రైతులు ఆనందంలో ఉన్నారని అన్నారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వడంతో పాటు పంట పెట్టుబడి సహాయం ఘనత కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ పాలకులు సాగు, తాగునీరివ్వక కన్నీరే మిగిల్చారని అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, దామోదర్‌రావు, ఎల్లారెడ్డి, బాలముకుందం, సురేశ్, మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, జాన్, రాజిరెడ్డి, మధు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

రాయికల్: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం అయోధ్య, కొత్తపేట గ్రామాలకు చెందిన 50 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. సీఎం ప్రవేశపెట్టిన పథకాలతో ప్రతి గ్రామంలో లబ్ధిదారులున్నారన్నారు. దశలవారీగా పింఛన్ పెంచుతామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని కోరారు. రాజ్ శ్రీనివాస్, కొత్తపేట సర్పంచ్ బత్తిని రాజేశం, ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ, నాగాలయ కమిటీ చైర్మన్ ప్రవీణ్, మైనార్టీ అధ్యక్షుడు షరిఫోద్దీన్ పాల్గొన్నారు.

నేను మీవాడిని.. మీ వెంటే ఉంటా..


కుస్తాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

- బీఆర్‌ఎస్ కోరుట్ల అభ్యర్థి డా.సంజయ్

కోరుట్ల: నేను మీవాడిని.. ఎప్పటికీ మీ వెంటే ఉంటానని బీఆర్‌ఎస్ కోరుట్ల అభ్యర్థి డా.సంజయ్ అన్నారు. సోమవారం కోరుట్లలోని పట్టణంలోని 15 వార్డుల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. పది సంవత్సరాలుగా నియోజకవర్గంలో ప్రతీ ఒక్కరి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని అన్నారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో కోరుట్ల పట్టణంలో ప్రతీ ఒక్క రోడ్డును బీటీ, సీసీలుగా మార్చామని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, వైస్ చైర్మన్ గడ్డమీద పవన్, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్లు అన్వర్, గంగాధర్, ఎంబేరి నాగభూషణం, సత్యం, సజ్జు పాల్గొన్నారు.

మల్లాపూర్ : ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసేవారికే ఎన్నికల్లో పట్టం కట్టాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరారు. కుస్తాపూర్, సిరిపూర్ గ్రామాల్లో ప్రచారంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పాల్గొన్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు మల్లయ్య, మండల అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నాగేష్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచులు గోవింద్‌నాయక్, లక్ష్మీ పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే మేలు చేకూరుతుందని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. కుస్తాపూర్, రత్నాపూర్, సిరిపూర్, ముత్యంపేట, గుండంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం: డాక్టర్ సంజయ్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు జగన్‌రావు, విజయ్ తిమ్మాపూర్ తండాలో ఇంటింటా ప్రచారం చేశారు.

ఓటు వేటలో ఆటవిడుపు


బ్యాటింగ్ చేస్తున్న కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి: దీపావళి పండుగను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని పలు ఆలయాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ పూజలు చేశారు. స్థానిక త్రిశక్తి ఆలయ ఆవరణలో చిన్నారులు క్రికెట్ ఆడుతుండడాన్ని గమనించిన సంజయ్.. బ్యాటింగ్ చేసి ఆనందపరిచారు.

పలు కుల సంఘాలతో సంజయ్ సమావేశమయ్యారు. రజక, ముదిరాజ్, కాపు సంఘాల నాయకులను మద్దతివ్వాలని కోరారు. 25వార్డులో సంజయ్ తల్లి ప్రచారం నిర్వహించారు. పట్టణానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు సోమవారం కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్ మృతి


శ్రీనివాస్(ఫైల్)


రాజనర్సయ్య (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రానికి చెందిన మాజీ కౌన్సిలర్ అనుమల్ల శ్రీనివాస్(కోర్టు శ్రీను) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అనారోగ్యంతో వేంపల్లి ఉప సర్పంచ్ మృతి

మల్లాపూర్: వేంపల్లి ఉప సర్పంచ్ వెల్మల రాజనర్సయ్య(55) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. రాజనర్సయ్య ఇటీవల అస్వస్థతకు గురవగా.. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రాజనర్సయ్య చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. రాజనర్సయ్యకు భార్య గంగరాజు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు బిట్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

ధర్మపురి: గిరిజన బోదరగూడెంకు చెందిన అద్దరి చిన్నన్న(80) బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడికి ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్యకు సంతానం కలగకపోవడంతో మరొకరిని వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లున్నారు. చిన్నన్న గ్రామంలో కూలీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. చిన్నన్నకు అదే గ్రామానికి చెందిన కొందరితో గొడవలున్నాయి. గొడవల్లో చిన్నన్నకు అవమానం జరగగా.. అది భరించలేక ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా దీపావళి వేడుకలు


భీంరాజ్‌పల్లిలో టపాసులు కాల్చుతున్న చిన్నారులు

గొల్లపల్లి: దీపావళి పర్వదినాన్ని మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆది, సోమవారాల్లో మహిళలు ప్రత్యేకంగా లక్ష్మీదేవి పూజలు, దంపతులు కేదారేశ్వర వ్రతం నిర్వహించారు. సాయంత్రం వాకిళ్ల ముందు అందమైన ముగ్గులు వేసి.. ప్రమిదలు వెలిగించి.. టపాసులు కాల్చి సందడి చేశారు. బాణసంచా విక్రయ దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. మంత్రి ఈశ్వర్ వేడుకల్లో పాల్గొన్నారు.

మద్యం పట్టివేత


నిందితుడితో సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారు రంగంపల్లిలో బైక్‌పై వెళ్తున్న వేముల పెంటయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా.. హర్యాన రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలు లభ్యమయ్యాయని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. రంగంపల్లికి చెందిన పెంటయ్య ఢిల్లీ నుంచి కార్లు కొనుగోలు చేసి తెచ్చి ఈ ప్రాంతంలో అమ్ముతుంటాడని, తిరుగు పయనంలో హర్యాన మద్యం సీసాలను వెంట తెచ్చి బెల్టు షాపులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని పెంటయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిబ్బంది శరత్‌బాబు, శ్రీనాథ్, కృష్ణ, మోజెస్, కార్తీక్‌రెడ్డి ఉన్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు గుర్తిస్తే సెల్ నెంబరు 87126 58817కు సమాచారమందించాలన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న లారీ ఇదే..

మెట్‌పల్లిరూరల్: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆదివారం కోరుట్ల వైపు నుంచి లారీలో తరలిస్తున్న 260 క్వింటాళ్ల బియ్యం మారుతినగర్ వద్ద పట్టుబడిందన్నారు. వీటి విలువ సుమారు రూ.5.20 లక్షలుంటుందని అన్నారు. లారీ యజమాని కోరుట్లకు చెందిన అహ్మద్‌గా గుర్తించి అతడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

శ్రీరాములపల్లెలో డీపీవో విచారణ


విచారణ చేపడుతున్న డీపీవో దేవరాజ్

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లెలో డీపీవో దేవరాజ్ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కుడుకుల లావణ్య తన సొంత పట్టా భూమిలో ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం పంచాయతీ కార్యదర్శికి ఆర్నెళ్ల క్రితం దరఖాస్తు చేసుకుంది. కార్యదర్శి అనుమతి ఇవ్వకపోవడంతో బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. బాధితురాలు తన డాక్యుమెంట్లు, ఇంటినిర్మాణ మ్యాప్, ఇతర పత్రాలను ఆయనకు చూపించారు. వాటితో ఆర్నెళ్ల క్రితం సమర్పించానని, అయినా అనుమతి ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్నాడని వాపోయింది. తన భర్త ఉపాధి నిమిత్తం విదేశాల్లో ఉండగా. మహిళనని చూడకుండా నిత్యం జీపీ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నాడని గోడు వెళ్లబోసుకుంది. ఆమె వాగ్మూలాన్ని రికార్డు చేసుకున్న డీపీవో కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తానని పేర్కొన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని డీపీవో దేవరాజ్ తెలిపారు. ఆయన వెంట ఎంపీవో సురేష్‌రెడ్డి ఉన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

- భార్య మృతి


వీర రాఘవమ్మ (ఫైల్)

రామగిరి: కుటుంబ కలహాల నేపథ్యంలో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. భార్య మృతిచెందింది. కల్వచర్ల పంచాయతీ ప్రశాంత్‌నగర్‌లో ఉప్పులూరి వీర్రాజు, వీర రాఘవమ్మ(55) దంపతులు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీర్రాజు కొద్దికాలంగా మద్యానికి బానిస కావడంతో.. గొడవలు మొదలయ్యాయి. సోమవారం ఉదయం వీర్రాజు మద్యం తాగి వీర రాఘవమ్మతో గొడవ పడడంతో.. తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగింది. అనంతరం వీర్రాజు తాగాడు. గమనించిన స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో భార్య వీర రాఘవమ్మ మృతిచెందింది. మెరుగైన చికిత్స కోసం వీర్రాజును కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరి ఇద్దరి కూతుళ్లకు వివాహమైంది. మృతురాలి కూతురు మద్దుకూరి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కటిక రవిప్రసాద్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మానకొండూర్: కొండపల్కలకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీరాముల మోహన్(33) తన నాయీబ్రాహ్మణ వృత్తి ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజులుగా విపరీతమైన వెన్ను నొప్పి వస్తుండటంతో ఆస్పత్రిలో చూపించుకొని, మందులు వాడుతున్నాడు. నొప్పి తగ్గడం లేదు. దీపావళి పండుగ సందర్భంగా అతని భార్య రజని ఖాజీపేటలోని తన తల్లిగారింటికి వెళ్లింది. మోహన్ ఇంటి ఆవరణలో గల మామిడి చెట్టుకు ఉరేసుకున్నాడు.

మద్యం దుకాణాలపై కేసు


కేసు నమోదు చేస్తున్న సీఐ రమేశ్

గోదావరిఖని: ఎన్నికల కమిషన్‌కు సకాలంలో సేల్స్ వివరాలందించని రెండు మద్యం దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు రామగుండం ఎక్సైజ్ సీఐ సుంకరి రమేశ్ తెలిపారు. ఎన్నికల కమిషన్‌కు ప్రతిరోజు రాత్రి 11 గంటల్లోపు ఆయా బ్రాందీషాపుల సేల్స్ వివరాలు పెట్టాలని అన్ని షాపులకు చెప్పినా.. యజమానులు పట్టించుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. స్టాక్ రిజిస్టర్లు అందుబాటులో లేని యైటింక్లయిన్‌కాలనీకి చెందిన తెలంగాణ వైన్స్, గోదావరిఖని మార్కెట్ వద్ద గల దుర్గావైన్స్‌పై నాన్ మెయింటెనెన్స్ ఆఫ్ అకౌంట్ రిజిస్టర్ కేసు నమోదు చేసి రూ.15 వేల చొప్పున జరిమానా విధించామన్నారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని లింగాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి స్థానిక ఆర్‌ఎంపీ అందించిన వైద్యం వికటించి, మృతిచెందాడని బాధిత కుటుంబసభ్యులు అన్నారు. ఈ మేరకు సదరు వైద్యుడి ఇంటి ఎదుట నిరసన తెలిపారు. మృతుడి సోదరుడు, పోలీసుల వివరాల ప్రకారం.. అంతం రాజిరెడ్డి(51) వారం రోజుల క్రితం పొలం పనులకు వెళ్లి, అనారోగ్యానికి గురయ్యాడు. గ్రామంలోని ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లగా ఇంజక్షన్ వేసి, సెలైన్ పెట్టాడు. తర్వాత అతని శరీర రంగు మారింది. కుటుంబసభ్యులు హుటాహుటిన కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్‌ఎంపీ అందించిన వైద్యం వికటించడం వల్లే రాజిరెడ్డి మృతిచెందాడని కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మృతదేహంతో సదరు వైద్యుడి ఇంటి ఎదుట బైఠాయించారు. కానీ, అంతకుముందే సదరు అతను పరారయ్యాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పోలింగ్ శాతం పెంచేందుకు..

- మహిళలు, యువకులు, దివ్యాంగులకు ప్రత్యేక కేంద్రాలు


మహిళా ఓటర్లు

ధర్మపురి: ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత. ఓటు పెంపుదల కోసం ఈసారి ఎన్నికల కమిషన్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. కొన్ని సంవత్సరాల నుంచి పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తూ వచ్చారు. కాని మహిళలు, యువకులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడంతో.. వేలాది మంది తమ ఓటును వినియోగించుకోలేకపోయారు. కాని ఈసారి అలా జరగకుండా ఉండేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున వారి కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ జరిగేలా చర్యలు చేపడుతున్నారు. ప్రతి నియోజకవర్గంలో కొన్ని ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయగా.. అందులో ఒకటి యువతకు, ఒకటి దివ్యాంగులకు, ఐదు ఆదర్శ, ఐదు మహిళల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 3 నియోజకవర్గాల్లో మొత్తం 785 పోలింగ్ కేంద్రాలుండగా.. ధర్మపురిలో 269, జగిత్యాలలో 254, కోరుట్లలో 262 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో యువతకు 3, దివ్యాంగులకు 3, మహిళలకు 15, ఆదర్శ కేంద్రాలు 15 ఏర్పాటు చేయనున్నారు.

ఆదర్శ కేంద్రాలు..

గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ ఎక్కడ జరిగిందో గుర్తించారు. ఆదర్శ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అధికారులు ఒక్కో నియోజకవర్గంలో ఐదు కేంద్రాలను ఎంపిక చేశారు. వంద శాతం ఓటు జరిగేలా చర్యలు చేపడుతున్నారు.

యువతకు ప్రత్యేక కేంద్రం..

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో యువత కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించిన ఎన్నికల్లో యువత కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. సత్ఫలితాలనిచ్చింది. యువ ఓటర్లను ఆకర్షించేలా గోడలపై సందేశాలను రాసి ప్రదర్శించనున్నారు. ఈ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ బాధ్యతలను యువ అధికారులకు కేటాయిస్తారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 18 నుంచి 39 వయస్సున్న యువ ఓటర్లు 3,15,197 మంది ఉన్నారు.

మహిళలకు ప్రత్యేకం..

ఎన్నికల్లో మహిళలదే కీలక పాత్ర. ఈసారి వారికి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో నియోజకవర్గానికి ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈసారి వారి కోసం ఐదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాల్లో అటెండర్ స్థాయి నుంచి అధికారి స్థాయి వరకు మహిళలనే ఏర్పాటు చేస్తారు. జిల్లాలో 3,55,629 మంది మహిళా ఓటర్లున్నారు.

దివ్యాంగులకు..

గత ఎన్నికల్లో వేల మంది దివ్యాంగులు సరైన వసతుల్లేక ఓటు వినియోగించుకోలేకపోయారు. ఈసారి వంద శాతం ఓటేసేందుకు దివ్యాంగులకు నియోజకవర్గానికో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

పోలింగ్ పెంచొచ్చు



వంద శాతం ఓటింగ్ జరిగేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కేంద్రాలపై దృష్టి సారించింది. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ఆకర్శణీయంగా తీర్చిదిద్దుదాం. అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాం.

– దివాకర, ఎన్నికల రిటర్నింగ్ అధికారి